

వర్షం కారణంగా మ్యాచ్‌లకు ఆటంకం
కడపలో నిర్వహిస్తున్న అండర్–14 క్రికెట్ టోర్నమెంట్‌కు వర్షం ఆటంకంగా మారింది. చిత్తూరు, విశాఖపట్నం మ్యాచ్ వర్షం కారణంగా తొలిరోజు రద్దయింది. -8లో



సారస్వతమూర్తి డాక్టర్ జానమద్ది
తెలుగు సాహిత్య రంగంలో మరువలేని పేరు డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి. బ్రౌన్ గ్రంథాలయం ఏర్పాటుకు ఆయన ఎంతో కృషి చేశారు. -8లో

గరిష్టం/కనిష్టం
29.4/24.0

వాతావరణం
జిల్లాలో శనివారం 24.0 – 29.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.05 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. - కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

టెట్ పరీక్షకు 185 మంది గైర్హాజరు

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా శనివారం నిర్వహించిన ఏపీ టెట్ పరీక్షకు 185 మంది గైర్హాజరైనట్లు డీఈఓ మర్రెడ్డి అనురాధ తెలిపారు. జిల్లాలోని కడప, పొద్దుటూరులలో కలుపుకుని 8 పరీక్షా కేంద్రాలలో ఉదయం, సాయంత్రం రెండు సెషన్లలో నిర్వహించిన ఏపీ టీచర్ ఎలిజిబిలిటి టెస్టు–2024కు 1680 మందికిగాను 1495 మంది హాజరుకాగా 185 మంది గైర్హాజరైనట్లు ఆమె తెలిపారు.

రేపు జిల్లాస్థాయి ఖోఖో ఎంపికలు

కడప స్పోర్ట్స్: చింతకొమ్మదిన్నె మండల పరిధిలోని బయనపల్లె శ్రీవెంకటేశ్వర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఈనెల 21వ తేదీ ఉదయం 11 గంటలకు ఉమ్మడి వైఎస్ఆర్ కడప (వైఎస్ఆర్, అన్నమయ్య) జిల్లాస్థాయి ఖోఖో జూనియర్ విభాగం ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఖోఖో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డా. కె. రామసుబ్బారెడ్డి, జె. నరేంద్ర తెలిపారు. ఎంపికల్లో పాల్గొనేందుకు 2006 నవంబర్ 21వ తేదీ తర్వాత పుట్టిన వారు అర్హులన్నారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు ఈనెల 25 నుంచి 27వ తేదీ వరకు చిత్తూరు జిల్లా కాణిపాకంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు 98497 13690 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

24న బద్వేలులో వైవీయూ అంతర్ కళాశాలల క్రీడా పోటీలు

వైవీయూ: బద్వేలు పట్టణంలోని బిజివేముల వీరారెడ్డి డిగ్రీ కళాశాలలో ఈనెల 24వ తేదీన వైవీయూ అంతర్ కళాశాలల క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు వైవీయూ క్రీడాబోర్డు కార్యదర్శి డాక్టర్ కె. రామసుబ్బారెడ్డి తెలిపారు. పురుషులు, మహిళల విభాగాల్లో బ్యాడ్మింటన్ సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపికల్లో పాల్గొనదలచిన క్రీడాకారులు తమవెంట కళాశాల ప్రిన్సిపాల్ లేదా ఫిజికల్ డైరెక్టర్ సంతకం చేసిన ఎలిజిబిలిటీ ఫాంలు, అటెస్టెడ్ సర్టిఫికెట్‌లతో హాజరుకావాలని సూచించారు. 2024 జూలై 1వ తేదీ నాటికి 17 సంవత్సరాలు నిండి 25 సంవత్సరాలలోపు ఉన్న క్రీడాకారులు మాత్రమే ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. పూర్తి వివరాలకు 9000294626, 9705459052 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

23న చలో వైవీయూ



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి గంగాసురేష్

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయంలో అవినీతి, లైంగిక వేధింపుల ఆరోపణలు ఉన్న ఆచార్య కె. కృష్ణారెడ్డిని వీసీగా కొనసాగించడాన్ని నిరసిస్తూ ఈనెల 23వ తేదీన చలో యోగివేమన విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్నట్లు ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి. వలరాజు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వి. గంగాసురేష్ తెలిపారు. శనివారం వైవీయూలో వారు మాట్లాడుతూ వీసీగా నియమితులైన ఆచార్యునిపై గతంలో లైంగిక ఆరోపణలు, కృష్ణా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా ఉన్న సమయంలో ఏసీబీ ఎంక్వైరీలు వేయడం, ఇలా ఆరోపణలు ఉన్న వ్యక్తిని ఉన్నతమైన వీసీ పదవికి నియమించడం నైతికంగా సరికాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె. శివశంకర్, శివచంద్ర తదితరులు పాల్గొన్నారు.

న్యాక్ పీర్ టీం చైర్మన్‌గా వైవీయూ ఆచార్యుడు



ఆచార్య బాయినేని శ్రీనివాసులు

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయం ఎకనామిక్స్ ప్రొఫెసర్ బాయినేని శ్రీనివాసులు నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ (ఎన్.ఎ.ఎ.సి) పీర్ టీం చైర్మన్ గా నియమితులయ్యారు. ఈ బృందం కేరళ రాష్ట్రంలోని తిరువనంతపురంలో ఉన్న మహాత్మా గాంధీ డిగ్రీ కళాశాలను ఈ నెల 23, 24వ తేదీన సందర్శించనుంది. ఈ బృందానికి సమన్వయకర్తగా డాక్టర్ ఎన్.ఆర్ మోహన్ వ్యవహరించనున్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఆచార్య శ్రీనివాసులు మహారాష్ట్ర లోని మయానిలోని ఆర్ట్స్ అండ్ కామర్స్ కాలేజీకి న్యాక్ పీర్ టీం మెంబర్ సమన్వయకర్తగా, తమిళనాడులోని శ్రీ రామలింగ స్వాదంబిగల్ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ కామర్స్‌నకు న్యాక్ పీర్ టీం మెంబర్ సమన్వయకర్తగా, మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్ లో ఉన్న గవర్నమెంట్ సంజయ్ గాంధీ స్మారక పీజీ కళాశాలకు టీమ్ మెంబర్ గా వెళ్లి క్రియాశీలకమైన బాధ్యతలను నిర్వర్తించారు. ఆ క్రమంలో తాజాగా తిరువనంతపురం మహాత్మాగాంధీ డిగ్రీ కళాశాల న్యాక్ పీర్ టీం చైర్మన్ గా నియమితులయ్యారు.

ఆధిపత్య పోరు!

- ఒకరిపై మరొకరు పైచేయి సాధించాలనే లక్ష్యంతో టీడీపీ నేతలు
- అధిష్టానానికి ఫిర్యాదు చేశాడనే శివకొండారెడ్డిపై హత్యాయత్నం
- అదే విషయాన్ని చర్చించుకుంటున్న తెలుగు తమ్ముళ్లు
- కడప గడపలో ఎన్నడూ లేని సంస్కృతి తెరపైకి వస్తున్న వైనం
- ముద్దనూరులో పరస్పర దాడులు చేసుకున్న కూటమి నేతలు
- ప్రొద్దుటూరులో నువ్వా నేనా... అంతర్గత పోరులో దేశం నేతలు




సాక్షి ప్రతినిధి, కడప: అధికార తెలుగుదేశం పార్టీలో ఆధిపత్య పోరు నడుస్తోంది. పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్న నేతలకు విలువ లేకుండా పోయిందని కొందరు... కష్ట నష్టాలకు ఓర్చుకున్న వాళ్లకు దిక్కు దివానం లేకుండా పోయిందని ఇంకొందరు ఆవేదనలో ఉన్నారు. ఎమ్మెల్యే మనుషులం, మేము చెప్పిందే వేదమని నడిమంత్రపు హోదాతో మరికొందరు రెచ్చిపోతున్నారు. ఈక్రమంలో పరస్పర దాడులు తెరపైకి వస్తున్నాయి. ముద్దనూరు, కడప ఘటనలు అందులో భాగమేనని తెలుస్తోంది. టీడీపీ కడప సిటీ అధ్యక్షుడు సానపురెడ్డి శివకొండారెడ్డిపై హత్యాయత్నం ఘటన కూడా అందులో భాగమేనని తెలుగు తమ్ముళ్లు బాహాటంగా చెప్పుకు వస్తున్నారు.

- పార్టీ జెండా మోసిన నేతలు పల్లకి మోసే బోయలుగానే మిగిలిపోతున్నారనే భావన టీడీపీ సీనియర్లలో ఉండిపోయింది. ఆ పార్టీ ఎమ్మెల్యేల అనుంగు శిష్యుల చర్యలు కూడా సీనియర్ల ఆరోపణలకు అనుగుణంగా ఉంటున్నాయి. అధికార పార్టీ నేతలమని చెప్పుకోవడం మినహా, ఎమ్మెల్యే కరుణ లేకపోతే, చెల్లని రూకగా మిగిలిపోతున్నామని ఆవేదన కొందరిలో ఉండిపోయింది. ఈ క్రమంలో అధిష్టానం వద్ద పరపతి ఉన్న నేతలు నేరుగా క్షేత్రస్థాయిలో చోటుచేసుకుంటున్న వ్యవహారాలపై ఫిర్యాదులు చేస్తున్నారు. పార్టీ దిశా–నిర్దేశానికి అనుగుణంగా ఎమ్మెల్యేల చర్యలు లేవని కొంతమంది తేల్చి చెబుతున్నారు. ఈ క్రమంలో అంతర్గతంగా నడుస్తున్న ఆధిపత్య పోరు ప్రత్యక్ష ఘర్షణలకు దారి తీస్తున్నట్లు విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

కడప గడపలో విష సంస్కృతి: కడప గడపలో గడిచిన నాలుగు నెలలుగా విష సంస్కృతి రాజ్యమేలుతోంది. మునుపెన్నడూ లేని విధంగా ఒకరి వ్యాపారాలు ఇంకొకరు స్వాధీనం చేసుకోవడం తెరపైకి వచ్చింది. ఈక్రమంలోనే నగరం నడిబొడ్డున ఉన్న ఓ మద్యం వ్యాపారికి చెందిన రెండు బార్ అండ్ రెస్టారెంట్లు తెలుగు తమ్ముళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఉదంతంతో ఒక్కమారుగా నగర ప్రజానీకం ఆశ్చర్యానికి లోనయ్యారు. ఎప్పుడూ లేని సంస్కృతి బహిర్గతం కావడంపై తీవ్ర చర్చ నడిచింది. ఆ ఘటన మరువకమునుపే నగర టీడీపీ నేత శివకొండారెడ్డిపై హత్యాయత్నం ఘటన తెరపైకి వచ్చింది. నడిరోడ్డుపై తల పగలగొట్టి భయాందోళనకు గురి చేశారు. స్థానికుల ప్రమేయంతో శివకొండారెడ్డి ప్రాణాపాయం నుంచి బయటపడ్డారని పలువురు చెప్పుకొస్తున్నారు. కాగా, శివకొండారెడ్డి సైతం ఫలానా వ్యక్తులు హత్యాయత్నానికి పాల్పడ్డారని ఫిర్యాదు చేయకపోగా, గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారని ఫిర్యాదు చేయడం కూడా భయోత్పాతంలో భాగమేనని సమాచారం.

టీడీపీ నేతల మధ్య తరచూ వివాదాలు...
అధికార దర్పం అనుభవించడంలో జిల్లాలో తెలుగు తమ్ముళ్ల మధ్య తరచూ వివాదాలు తెరపైకి వస్తున్నాయి. ప్రొద్దుటూరులో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి వర్గీయుల మధ్య ఇలాంటి వివాదాలు తెరపైకి వచ్చాయి. జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌ఛార్జీ భూపేష్‌రెడ్డి వర్గీయుల మధ్య ముద్దనూరులో పరస్పర దాడులు తెరపైకి వచ్చాయి. పులివెందులలోనూ ఇదే తంతు నడుస్తోంది. ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, ఇన్‌ఛార్జీ బీటెక్ రవీంద్రారెడ్డి మధ్య ఇలాంటి ఆధిపత్య వ్యవహారాలు తెరపైకి వస్తున్నా యి. అధికార దర్పం కోసం తెగబడుతోన్న తెలుగు తమ్ముళ్లను కట్టడి చేయాల్సిన ఆవశ్యకత ఉందని ప లువురు ఆపార్టీ అధిష్టానాన్ని కోరుతుండడం విశేషం.

120 రోజులు.. 120 పేజీలు...



టీడీపీ సర్కార్ 100 రోజుల పాలన నేపథ్యంలో 'ఇది మంచి ప్రభుత్వం' అనే కార్యక్రమాన్ని సెప్టెంబర్ 20 నుంచి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు ప్రత్యక్షంగా పాల్గొని ప్రజలకు సీఎం చంద్రబాబు నాయుడు పాలన వివరిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో 120 రోజులు కడప పాలనపైన 120 పేజీల ఫిర్యాదును నగర అధ్యక్షుడు సానపురెడ్డి శివకొండారెడ్డి టీడీపీ అధిష్టానానికి అందించినట్లు సమాచారం. ప్రస్తుతం టీడీపీ నేతలుగా చలామణి అవుతోన్న, ఎమ్మెల్యే వద్ద అత్యంత పరపతి కల్గిన నాయకుల చర్యలపై పూసగుచ్చినట్లు వివరించినట్లు తెలుస్తోంది. 'కృష్ణలీలలు' 'రామకథలు' 'శివతాండవం' 'ద్వారకమయం' లాంటివి అన్నీ సమగ్రంగా తెలియజేసినట్లు సమాచారం. ఇదే విషయాన్ని అధిష్టానం సీనియర్లు, ఆ పార్టీశ్రేయోభిలాషుల ద్వారా సమాచారం సేకరించింది. అందులో వాస్తవాల ఆధారంగా కడప ముఖ్యనేతను ప్రశ్నించినట్లు సమాచారం. కడపలో పార్టీ కార్యకర్తలతో నిమిత్తం లేకుండా స్వంతంగా విస్తరించాలనే ఆలోచన ఉందా? ఎందుకు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని నిలదీసినట్లు విశ్వసనీయ సమాచారం. ఆమేరకే నగర టీడీపీ అధ్యక్షుడు శివకొండారెడ్డిపై శనివారం హత్యాయత్నం చోటుచేసుకున్నట్లు ఆ పార్టీ నేతలు బాహాటంగా చెప్పుకుంటున్నారు.

టీడీపీ కడప అధ్యక్షుడిపై హత్యాయత్నం

- తెల్లవారుజామున గుర్తు తెలియని దుండగుల దాడి
- తలపై బలమైన గాయాలు, వీపుపై కట్టెల దాడి గుర్తులు

కడప ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రమైన కడపలో తెలుగుదేశం పార్టీ నగర అధ్యక్షుడు శివ కొండారెడ్డిపై శని వారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు దాడిచేశారు. పాల కోసమని కడపలోని మానస కళ్యాణ మండలం వద్ద ఉన్న షాపు దగ్గరకు వెళుతున్న సమయంలో ఇద్దరు గుర్తు తెలియని దుండగులు స్కూటర్‌పై వచ్చి ఆయనపై కట్టెలతో దాడి చేసి గాయపరిచారు. దీంతో శివకొండారెడ్డి తలకు బలమైన గాయం కాగా, వీపుపైన కట్టెలతో దాడి చేసిన గుర్తులు పడ్డాయి. స్థానికులు బాధితుడిని వైద్య చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. శివకొండారెడ్డి ఫిర్యాదు మేరకు చిన్నచౌక్ సీఐ తేజమూర్తి ఆధ్వర్యంలో ఎస్ఐలు రాజరాజేశ్వర్‌రెడ్డి, రవికుమార్‌లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది. గాయాలై రిమ్స్‌లో చికిత్స పొందుతున్న శివకొండారెడ్డిని టీడీపీ కడప నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి అమీర్‌బాబుతో పాటు పలువురు నాయకులు పరామర్శించారు.



విచారిస్తున్న ఎస్ఐలు రాజరాజేశ్వర్ రెడ్డి, రవికుమార్

నింధితులను కఠినంగా శిక్షించాలి
శివకొండారెడ్డిపై దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని అమీర్‌బాబుతో పాటు శివకొండారెడ్డి సోదరులు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజును కలిసి ఫిర్యాదు చేశారు.



నిందితుల దాడిలో గాయపడిన శివకొండారెడ్డి

కొనసాగుతున్న వర్షాలు

కడప అగ్రికల్చర్: జిల్లాలో వర్షాలు కొనసాగుతూనే ఉన్నాయి. శుక్రవారం తెల్లవారుజాము నుంచి శనివారం ఉదయం వరకు జిల్లాలోని పలు మండలాల్లో వర్షం కురిసింది. పెండ్లిమర్రిలో అత్యధికంగా 50.2 ఎంఎం వర్షం కురిసింది. చాపాడులో 15 ఎంఎం, కొండాపురంలో 13.2, కమలాపురంలో 11.2, తొండూరులో10.6 , గోపవరంలో 10, సింహాద్రిపురంలో 8.4, పులివెందుల్లో 8.2, వీఎన్‌పల్లిలో 6.8, జమ్మలమడుగులో 6.4, ముద్దనూరు, వల్లూరులో 5.2, చెన్నూరులో 4.6 , కాశినాయన, బద్వేల్ 4.4, కడప 4.2, ఖాజీపేట 3.8, మైలవరం 3.4, బి.మఠం, వేములలో 3, వేంపల్లిలో 2.4, మైదుకూరులో 2, బికోడూరులో 1.8, రాజుపాలెంలో 1.6, సికెదిన్నెలో 1.2, లింగాల, చక్రాయపేట, అట్లూరులలో 1 ఎంఎం చొప్పున వర్షపాతం నమోదయింది.

దుష్ప్రచారం మానండి

- టీడీపీ సోషల్ మీడియా వింత చేష్టలు
- సీఎం చంద్రబాబు తీరుపై ధ్వజమెత్తిన వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి



సాక్షి ప్రతినిధి, కడప: సీఎం చంద్రబాబు, టీడీపీ ఓ పథకం ప్రకారం కుట్ర పన్నుతోందని.. లేనిది ఉన్నట్లు, ఉన్నది లేనట్లు వైఎస్సార్‌సీపీపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆ పార్టీ వైఎస్సార్ జిల్లా అధ్యక్షుడు పోచంరెడ్డి రవీంద్రనాథరెడ్డి అన్నారు. కడపలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీకి కార్యకర్తలను దూరం చేసేందుకు టీడీపీ సోషల్ మీడియా విషప్రచారానికి దిగుతోందన్నారు. వైఎస్ జగన్ వల్ల కార్యకర్తలు నష్టపోయారని, ఎవరూ ఇక ఆయన్ను నమ్మవద్దంటూ ఓ పోస్టును టీడీపీ వారే సృష్టించి విష ప్రచారం చేస్తున్నారన్నారు. గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో చెప్పిన ప్రతి హామీని అమలు చేసి పార్టీ కార్యకర్తలను కాలర్ ఎగురేసుకుని తిరిగే లా తమ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేశారని వివరించారు.

చంద్రబాబు సిద్ధహస్తుడు
దుష్ప్రచారం చేయడంలో సీఎం చంద్రబాబు సిద్ధహస్తుడని, మొన్న హిందువులు వైఎస్సార్‌సీపీకి దూరం చేయాలనే కుట్ర పన్నారని రవీంద్రనాథరెడ్డి తెలిపారు. నిస్సిగ్గుగా తిరుమల లడ్డూ ప్రసాదంపై ఆరోపణలు అంటగట్టారన్నారు. అవన్నీ చంద్రబాబు దుష్ప్రచారాలేని తేటతెల్లమైందని, నిన్న టీడీపీ ఎమ్మెల్యేల సమావేశంలో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ లాగా దోపిడీ చేస్తే సహించమని చెప్పడం మరీ విడ్డూరంగా ఉందన్నారు. వాస్తవంగా బాబు మాటలకు, చేష్టల కు పొంతన ఉండదన్నా రు. ఇసుక, మద్యం షాపుల్లో టీడీపీ దోపిడీకి అనుగుణంగా ప్రభుత్వ చర్యలున్నాయన్నా రు. నిల్వ ఉన్న 40లక్షల టన్నుల ఇసుక టీడీపీ నేతల దోపిడీ గురైందని, మద్యం షాపులను స్వాధీనం చేసుకుంటున్నారని, ఇవన్నీ తెలిసి కూడా సీఎం మొసలి కన్నీరు కారుస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు.

మేకల కాపరి ఆచూకీ లభ్యం

క్షేమంగా ఇంటికి తీసుకొచ్చిన గ్రామస్తులు



అటవీ ప్రాంతంలో నీరసంతో దొరికిన మేకల కాపరి గంగిరెడ్డి

అట్లూరు: గత సోమవారం అదృశ్యమైన మేకల కాపరి సొంటా గంగిరెడ్డి శనివారం మధ్యాహ్నం అటవీ ప్రాంతంలో గ్రామస్తులకు తటస్థపడడంతో క్షేమంగా ఇంటికి తీసుకొచ్చారు. ఈనెల 14వ తేదీన సొంటా గంగిరెడ్డి (60) అటవీ ప్రాంతానికి మేకలు తోలుకుని వెళ్లి తిరిగి రాలేదు. మంగళవారం రాత్రికి మేకలు మాత్రం ఇంటికి వచ్చాయి కానీ గంగిరెడ్డి మాత్రం ఇంటికి రాలేదు. రాత్రనక పగలనక 60 నుంచి 70 మంది ప్రతిరోజూ గాలించారు. డ్రోన్ కెమెరాలతో గాలించారు. ప్రయోజనం లేదు.. ఆశలు వదులుకున్నారు. అయినా చివరి ప్రయత్నంగా ట్రాక్టర్లతో గ్రామస్తులు, బంధువులు గాలింపు ముమ్మరం చేశారు. ఎట్టకేలకు గుబ్బకోన అటవీ ప్రాంతంలో సొంటా గంగిరెడ్డి నీరసంతో కనించడంతో హమ్మయ్యా.. దొరికాడు అని అక్కడ నుంచే సమాచారం అందించి ఇంటికి తీసుకొచ్చారు. కొంత విశ్రాంతి తీసుకొన్న తరువాత గంగిరెడ్డిని విచారించగా గడచిన ఆరు రోజులు వర్షాలు కురుస్తున్నాయి.. ఎలా ఇంటికి రావాలో తెలియదు. తూర్పు ఏదో పడమర ఏదో తెలియక ఇంటికి రాను దోవ తెలియక తిక మక పడి తిరుగుతూ ఉన్నానని సమాధానం తెలిపాడు. ఏదిఏమైనా ఇన్ని రోజులకు గంగిరెడ్డి ఆచూకీ లభించడంతో బంధువులు, గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఇంటికి తీసుకొచ్చి వైద్యపరీక్షలు చేయించగా 200 బీపీ ఉందని బంధువులు తెలిపారు.

తాగు నీటితోనే వారం రోజులు గడిపాను..
సోమవారం మేకలు తోలుకుని వెళ్లినాను.. వర్షం ఎక్కువగా ఉంది. ఇంటికి వచ్చేందుకు ఎలా వెళితే ఊరు వస్తుంది అనేది దిక్కు తోచలేదు. వర్షం వస్తే చెట్టుకిందకు వెళతా ఉన్నా వర్షం లేనప్పుడు మేకలు ఎలా వెళ్లాయి, అని వెతుకుతున్నా, ఇంటికి వెళ్లేందుకు దోవ తెలియలేదు. నాకు చలి అనిపించలేదు ఆకలి వేస్తే నీళ్లు తాగడం ఎక్కడ నిద్రవస్తే అక్కడ ఉన్న చెట్టుకింద నిదుర పోవడం తప్ప ఇంక నాకు ఏమీ తెలియలేదు. అప్పుడప్పుడు నేను ఎక్కడ ఉన్నానో నాకే తెలియదు. ఈరోజు మా వాళ్లు అందరూ నాదగ్గరకు వచ్చారు. ఇంటికి తీసుకొచ్చారు అంటూ సొంటా గంగిరెడ్డి సాక్షితో తెలిపారు.



అటవీ ప్రాంతంలో గంగిరెడ్డి ఆచూకీ కోసం గాలిస్తున్న గ్రామస్తులు, బంధువులు (ఫైల్)

పాఠశాల నుంచే ఉపాధి బాట

- పీఎంసీ స్కూల్స్‌లో వృత్తి విద్యా కోర్సుల అమలు
- 9,10 తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులతోపాటు శిక్షణ
- నైపుణ్య సాధనకు క్షేత్రస్థాయి సందర్శన



ఎర్రగుంట్ల ఐటీఐలో కంప్యూటర్‌పై శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులు



ఫ్యాన్‌ను రిపేర్ చేస్తున్న విద్యార్థి

కడప ఎడ్యుకేషన్: పాఠశాల విద్యతో ప్రారంభమై కళాశాల విద్య ముగిసే సమయానికి విద్యార్థులు వారి కాళ్లపై వారు నిలబడేందుకు కేంద్ర ప్రభుత్వం పలు విప్లవాత్మక, వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోంది. ముఖ్యంగా విద్యార్థులు కళాశాల విద్యను ముగించుకుని బయటకు వెళ్లేటప్పటికి వారి కాళ్లపై వారు స్వతహాగా నిలబడి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అంది పుచ్చుకునేలా పాఠశాల స్థాయిలోనే వృత్తి విద్యా బోధన చేపట్టేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే పాఠశాల స్థాయిలో వృత్తి విద్య కోర్సుల్లో అవగాహన కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకోసం ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంసీ) పేరుతో ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలను ఎంపిక చేసి అందులో ఈ వృత్తి విద్య కోర్సులు, శిక్షణ అమలుకు శ్రీకారం చుట్టింది.

అమలవుతున్న కోర్సుల వివరాలు ...
పీఎంసీ పాఠశాలల్లో అగ్రికల్చర్, ఆటోమేటివ్, ఐటి–ఐటిఈ, ఎలక్ట్రానిక్స్, బ్యూటీ అండ్ వెల్‌నెస్, రిటైల్, అప్పరెల్, బీఎఫ్ఎస్ఐ, హెల్త్‌కేర్ వంటి వృత్తి విద్యా కోర్సులను విద్యార్థులకు అమలు చేస్తున్నారు. ప్రతి రోజు ఒక పీరియడ్‌ను అమలు చేస్తూ వారంలో మూడు పిరియడ్లు థియరీ, మూడు పిరియడ్లు ప్రాక్టికల్స్ నిర్వహిస్తూ విద్యార్థులకు వృత్తి విద్యా కోర్సులు నేర్పించేందుకు కేటాయిస్తున్నారు.

సెలవు దినాల్లో...
వృత్తి విద్యా కోర్సులు నేర్పించడంతోపాటు పాఠశాలకు సెలవు దినాల్లో సమీపంలోని పరిశ్రమలు, చేతి వృత్తిల కేంద్రాల సందర్శనకు విద్యార్థులను ఫీల్డ్ విజిట్‌కు తీసుకుని వెళుతున్నారు. ఇందులో భాగంగా అక్కడ శిక్షణ ఇప్పిస్తారు. తద్వారా 9–12 తరగతులు చదివే విద్యార్థులను చేతి వృత్తులలో సయామత్త పరుస్తారు. గ్రామ, పట్టణ ప్రాంతాల్లోని చేతి వృత్తులను ప్రోత్సహించేందుకు ఇది వారికి దోహదపడుతుందని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ వృత్తి విద్యా కోర్సు వారికి భవిషత్తులో జీవనోపాధికి అండగా నిలువనుంది.

వృత్తి విద్యా కోర్సులు అమలవుతున్న పీఎంశ్రీ పాఠశాలల ఉన్న మండలాలు...
కొండాపురం, మైలవరం, పెద్దయుడియం, రాజుపాలెం, దువ్వూరు, మైదుకూరు, బిమఠం, కలసపాడు, పోరుమామిళ్ల, బద్వేల్, గోపవరం, ఖాజీపేట, చాపాడు, పొద్దుటూరు, జమ్మలముడు, ముద్దనూరు, పులివెందుల, తొండూరు, ఎర్రగుంట్ల, కమలాపురం, వల్లూరు, చెన్నూరు, ఒంటిమిట్ట, సిద్దవటం, కడప, సికెదిన్నె, పెండ్లిమర్రి, వెంపల్లి, చక్రాయపేట, ఎస్‌ఏ కాశినాయన

ఉపాధి గ్యారంటీ కోర్సులకు ప్రాధాన్యం



పీఎంసీ పాఠశాలల్లో కేంద్రం ఈ వృత్తి విద్యా కోర్సులను 2023లో ప్రారంభించగా ఈ విద్యా సంవత్సరం నుంచి పూర్తిస్థాయిలో అమలు చేస్తున్నారు. ఒక్కో పాఠశాలలో ఎంపిక చేసిన రెండు కోర్సుల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. ఇందు కోసం ఇద్దరు ఇన్‌స్ట్రక్టర్స్‌ను కూడా ఎంపిక చేశారు. వారు 9,10 తరగతులు చదివే ఆసక్తి ఉన్న విద్యార్థులను ట్రేడ్‌కు 50 మంది చొప్పున రెండు ట్రేడ్స్‌కు 100 మందిని ఎంపిక చేస్తారు. ఇలా ఇద్దరి ట్రైనర్స్‌కు కలిపి 200 మంది విద్యార్థులను ఎంపిక చేసి శిక్షణ ఇస్తున్నారు. పదవ తరగతి, ఇంటర్ పూర్తి అయ్యేనాటికి ప్రతి విద్యార్థి రెండు కోర్సుల్లో నైపుణ్యం సాధించేలా ప్రణాళిక అమలు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం వృత్తి విద్యా కోర్సుల్లో చేరే విద్యార్థులకు ముందస్తుగా సన్నద్ధం చేసే క్రమంలో భాగంగా పాఠశాల స్థాయిలో వృత్తి విద్యాబోధన అమలుకు నిర్ణయించింది. పని, అనుభవం, ఉత్పాదకత పెంచే దిశగా విద్యార్థులను సన్నద్ధం చేయడం, వివిధ రకాల వస్తువుల తయారీకి అవసరమైన పరికరాలు, యంత్రాలను గుర్తించడం, వాటిని ఎలా ఉపయోగించాలనేది విద్యార్థులకు నేర్పిస్తున్నారు.

ఎంఎస్ ఆఫీస్ బేసిక్స్ నేర్చుకున్నా...



వృత్తి విద్యాకోర్సుల్లో భాగంగా నేను కంప్యూటర్స్‌కు సంబంధించి ఎంఎస్ ఆఫీస్ బేసిక్స్‌ను నేర్చుకుంటున్నాను. ఎక్సెల్ షీటు, వర్డు ఫేమింగ్ వంటి వాటిని నేర్చుకున్నా. భవిషత్తులో అవసరమైతే దీనినే జీవనోపాధిగా ఏర్పాటు చేసుకుంటా.
– ఆర్. విజయజ్యోతి, బాలుర ఉన్నత పాఠశాల ఎర్రగుంట్ల

వృత్తి విద్య ఎంతో మేలు..



జిల్లాలో ఎంపిక చేసిన పీఎంసీ పాఠశాలలలో వృత్తి విద్యా కోర్సులను అమలు చేస్తున్నాం. విద్యార్థి దశ నుంచే వృత్తి విద్యను పరిచయం చేయడం ద్వారా వారిలో ఆత్మస్థైర్యం అలవడుతుంది. భవిషత్తులో నిరుద్యోగాన్ని జయించి అవసరమైతే వాళ్లకాళ్లపై వారు నిలబడేందుకు అవకాశం ఉంటుంది.
– మర్రెడ్డి అనురాధ, జిల్లా విద్యాశాఖ అధికారి

బ్యాలెట్ విధానం కొనసాగించాలి

– రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

కడప రూరల్ : ఈవీఎంలపై అందరికీ అనుమానాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అందరికీ ఆమోదయోగ్యమైన బ్యాలెట్ విధానాన్ని మళ్లీ కొనసాగించాలని వక్తలు అన్నారు. రాజ్యాంగ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో జాతీయ అధ్యక్షుడు సంగటి మనోహర్ అధ్యక్షతన శనివారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఎన్నికల అక్రమాలు, ఈవీఎంల అవకతవకలు, జమిలి ఎన్నికల నిర్వహణపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు చంద్రశేఖర్, గాలి చంద్ర, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు అఫ్జల్‌ఖాన్ మాట్లాడుతూ ఈవీఎంలపై కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీతో సహా ప్రముఖ రాజకీయ నేతలంతా అనుమానాలు వ్యక్తం చేశారని అన్నారు. అలాగే ఈ విధానంపై ప్రజల్లో కూడా పలు అనుమానాలు బలంగా ఉన్నాయని తెలిపారు. కాగా అభివృద్ధి చెందిన అమెరికా, బ్రిటన్ లాంటి దేశాలు ఈవీఎంలకు బదులుగా బ్యాలెట్ పేపర్లను వాడుతున్నారన్నారు. మన దేశంలో కూడా బ్యాలెట్ విధానం కొనసాగించాలని కోరారు. అలాగే దేశమంతా ఒకే సారి జమిలి ఎన్నికలు నిర్వహించాలను కోవడం అసాధ్యమన్నారు. ఇందుకు 18 రాజ్యాంగ సవరణలు చేయాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల ఖర్చును తగ్గించుకోవడానికే జమిలి ఎన్నికల నిర్వహణ అని చెప్పుకోవడం అర్థం లేనిదన్నారు. అభివృద్ధి చెందిన దేశాలు సైతం జమిలి ఎన్నికల జోలికి వెళ్లలేదని తెలిపారు. కార్యక్రమంలో వివిధ పార్టీలు, ప్రజా సంఘాలకు చెందిన నేతలు సయ్యద్ సలావుద్దీన్, రవిశంకర్‌రెడ్డి, గుర్రప్ప, శివారెడ్డి, సత్తార్, సీఆర్‌వీ ప్రసాద్ పాల్గొన్నారు.



నేడు జయంతి

సారస్వతమూర్తి డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి

కడప కల్చరల్ : తెలుగు సాహిత్య రంగంలో మరువలేని పేరు డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి. మరీ ముఖ్యంగా వైఎస్సార్ జిల్లా సాహిత్య లోకంలో ఆయనకు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. అటు గ్రంథాలయాల అభివృద్ధి, ఇటు బ్రౌన్ గ్రంథాలయం ఏర్పాటుతో సాహిత్యాభివృద్ధికి ఎంతో కృషి చేసిన డాక్టర్ జానమద్ది జయంతి అక్టోబరు 20న. ఈ సందర్భంగా ఆ సారస్వతమూర్తి గురించి క్లుప్తంగా..

తెలుగుభాష పరిరక్షకులుగా ఆంగ్లేయుడు సీపీ బ్రౌన్ అనంత కీర్తిని పొందారు. ఆయన సాహితీ కృషిని డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి తెలుగు వారికి అందజేశారు. బ్రౌన్ కార్యక్షేత్రమైన భవన శిథిలాలపైనే అపూర్వమైన కానుకగా సీపీ బ్రౌన్ స్మారక గ్రంథాలయం, భాషా పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. డాక్టర్ జానమద్దిలో ఆడంబరం కనిపించేది కాదు. ఆయన పేరుగాంచిన సాహితీవేత్త అయినా కూడా తొలి కవిత రాసిన వారితోనైనా డాక్టర్ జానమద్ది ఎంతో ఆప్యాయంగా ఉండి ప్రోత్సహించేవారు. చిన్న సాహితీ సభలకు సైతం సమయానికన్నా ముందే వెళ్లి ఏర్పాట్లు చూసేవారు. కుర్చీలు వేయడానికి కూడా వెనకాడేవారు కాదు.

సారస్వతమూర్తి..

జాతీయ స్థాయిలో తెలుగు కవులు, రచయితలతో ఆత్మీయ అనుబంధం గల ఆయన తెలుగు, ఆంగ్ల, కన్నడ భాషల్లో పలు రచనలను అనువదించారు. స్వయంగా ఎన్నో పుస్తకాలు రచించారు. అటు ప్రాచీన సాహిత్యం, ఇటు అభ్యుదయ సాహిత్యాన్ని ఒకేలా ఆదరించారు. ముఖ్యంగా జిల్లాలోని దాదాపు అందరూ కవులు, రచయితల గురించి పత్రికలలో అక్షరబద్ధం చేశారు. ప్రముఖులపై వేలాది వ్యాసాలు రాశారు. మన జిల్లాలో పత్రికలకు ప్రముఖ దినోత్సవాలు, ప్రముఖ వ్యక్తుల జయంతులు, వర్ధంతుల సందర్భంగా వ్యాసాలు రాసే ఒరవడికి ఆయనే శ్రీకారం చుట్టారని చెప్పవచ్చు. జిల్లా రచయితల సంఘం కార్యదర్శిగా గొప్ప కవులను జిల్లాకు ఆహ్వానించి సభలు ఏర్పాటు చేశారు. బ్రౌన్ గ్రంథాలయాన్ని జిల్లాలో సాహితీ సభలకు ముఖ్య కేంద్రంగా మార్చారు. విద్వాన్ కట్టా నరసింహులును మానస పుత్రుడిగా అభిమానించి క్లిష్టమైన కడప కైఫీయత్‌లను ఆయన ద్వారా పరిష్కరింపజేసి కీర్తి ప్రతిష్టలు సంతరించిపెట్టారు. సాహిత్యం పట్ల అభిమానం, అభిరుచి ఉన్న వారిని ఎంతో ఆదరించి ఆ రంగం వైపు ప్రోత్సహించారు. తెలుగుభాష, సంస్కృతులకు సంబంధించి అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులకు ఏ సమాచారం కావాలన్నా ఆయననే సంప్రదించేవారు.

కీర్తి పరిమళం

డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి 1925 అక్టోబరు 20న జన్మించారు. జిల్లా రచయితల సంఘం కార్యదర్శిగా గొప్ప కవులను జిల్లాకు ఆహ్వానించి సభలు ఏర్పాటు చేశారు. బ్రౌన్ గ్రంథాలయాన్ని జిల్లాలో సాహితీ సభలకు ముఖ్య కేంద్రంగా మార్చారు. గ్రంథాలయానికి ఆయన అందించిన సేవలకు గుర్తుగా 2014 అక్టోబరు 20న గ్రంథాలయ ఆవరణలో డాక్టర్ జానమద్ది శిలా విగ్రహాన్ని నాటి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ ద్వారా ఆవిష్కరింపజేశారు. 1998లో పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆయనకు గౌరవ డాక్టరేట్ అందజేసింది. ఆయన పేరిట 2012లో కుమారుడు, బ్యాంకు రిటైర్డ్ అధికారి జానమద్ది విజయభాస్కర్ జానమద్ది సాహితీపీఠం ఏర్పాటు చేసి సాహిత్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

ఆ జ్ఞాపకం ఖరీదు అమూల్యం

డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి పీఠం ఆధ్వర్యంలో 2018లో ఆయన మానస పుత్రుడు విద్వాన్ కట్టా నరసింహులుకు ఆయన పేరిట పురస్కారం అందజేశారు. అందులో భాగంగా రూ. 10 వేల చెక్కును అందజేశారు. కానీ కట్టా నరసింహులు ఆ చెక్కును మార్చుకోలేదు. తనకు పితృ సమానుడైన ఆ పవిత్రమూర్తి పేరిట ఇచ్చిన ఆ చెక్కును తాను ఆయన జ్ఞాపకంగా చిరకాలం దాచుకున్నానని విద్వాన్ కట్టా నరసింహులు 'సాక్షి'కి తెలిపారు. దాన్ని డబ్బుగా మార్చుకుంటే ఖర్చు అయిపోతుందని, ఆయన జ్ఞాపకాలు తనకు లక్షల విలువజేసే నిధిగా భావిస్తూ చెక్కును మార్చుకునే ఆలోచనకు శాశ్వతంగా చెక్ పెట్టానని తెలిపారు. ఆ చెక్కును గొప్ప జ్ఞాపికగా జీవితాంతం అట్టే ఉంచుకున్నారు.

ప్రత్యేక సంచికలు..

రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యంగా మన జిల్లాలో ఆయనకు వీరాభిమానులున్నారు. వారిలో ఒకరైన కొండూరు జనార్దన్‌రాజు 'జ్ఞాపకాల్లో మన జానమద్ది' పేరిట ప్రత్యేక సంచికను రూపొందించారు. అందులో జానమద్ది గురించి రాష్ట్ర వ్యాప్తంగా లబ్ధ ప్రతిష్టులైన 120 మంది రచయితలతో వ్యాసాలను ప్రచురించారు. బ్రౌన్ గ్రంథాలయం ఆధ్వర్యంలో అంతకు ముందే డాక్టర్ బ్రౌన్ శాస్త్రి గౌరవ సూచికంగా సంస్కృతి పేరిట ప్రత్యేక సంచికలు ప్రచురించారు. ఆయన 2014 ఫిబ్రవరి 28న ఈ లోకాన్ని వీడారు.

నేడు పురస్కారాల ప్రదానం

సీపీ బ్రౌన్ స్మారక గ్రంథాలయ నిర్మాత డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి శత జయంతి ప్రారంభ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం 10 గంటలకు బ్రౌన్ గ్రంథాలయంలో సభ నిర్వహించనున్నారు. జానమద్ది సాహితీపీఠం మేనేజింగ్ ట్రస్టీ జానమద్ది విజయభాస్కర్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. ఆంధ్రప్రదేశ్ సర్వోన్నత న్యాయస్థానం న్యాయమూర్తి జస్టిస్ బొప్పూరి కృష్ణమోహన్ ముఖ్యఅతిథిగా, తెలుగు సాహిత్య ప్రముఖులు పైనేని తులసీనాథం నాయుడు ఆత్మీయ అతిథిగా హాజరు కానున్నారు. ఈ సందర్భంగా జానమద్ది సాహితీపీఠం ఆధ్వర్యంలో గ్రంథాలయ, సాహిత్యసేవ పురస్కారాలను ప్రదానం చేయనున్నారు. సాయంత్రం 5.30 గంటలకు బ్రౌన్-శాస్త్రి మందిరంలో బ్రహ్మశ్రీ గండ్లూరి దత్తాత్రేయశర్మ ఆధ్వర్యంలో భువన విజయం సాహిత్య రూపకం ప్రదర్శించనున్నారు.

చీటింగ్ కేసులో వ్యక్తి అరెస్టు

కడప ఎడ్యుకేషన్ : ప్రేమ, పెళ్లి పేరుతో యువతిని మోసం చేసిన కేసులో వ్యక్తిని అరెస్టు చేసినట్లు తాలుకా పోలీసులు తెలిపారు. కడపకు చెందిన చిన్నబోయిన రాము కడప తాలూకా పరిధికి చెందిన యువతిని పెళ్లి పేరుతో మోసం చేశాడు. యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అతనిపై చీటింగ్ కేసు నమోదు చేసి శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఉద్యోగాల పేరుతో పలువురిని మోసం చేశాడనే ఆరోపణలపై రాముపై గతంలో కడప వన్ టౌన్, తాడిపత్రి, ప్రొద్దుటూరులలో కూడా కేసు నమోదైనట్లు తెలిపారు.

కౌలు రైతు ఆత్మహత్య



భూమిరెడ్డి నాగిరెడ్డి(ఫైల్)

బ్రహ్మంగారిమఠం : మండలంలోని మల్లేపల్లె పంచాయతీ లింగాలదిన్నెపల్లెకు చెందిన భూమిరెడ్డి సుబ్బిరెడ్డి కుమారుడు భూమిరెడ్డి నాగిరెడ్డి(30) శనివారం తెల్లవారు జామున పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సుబ్బిరెడ్డికి వ్యవసాయ పొలం తక్కువగా ఉండడంతో ఆయన కుమారుడు నాగిరెడ్డి అదే గ్రామంలో 3 ఎకరాలు భూమి కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. భూమిలో పెట్టిన పంటలు సరిగా రాకపోవడం, పంటల కోసం తెచ్చిన అప్పులు చెల్లించలేక పోవడంతో మనస్థాపానికి గురయ్యాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి తోట దగ్గరకు వెళ్లాడు. శనివారం ఇంటికి రాకపోవడంతో తోట దగ్గరకు వెళ్లి చూడగా అప్పటికే నాగిరెడ్డి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుని దగ్గర పురుగు మందు డబ్బా ఉందన్నారు. నాగిరెడ్డికి ఇంకా వివాహం కాలేదు. ఉన్న ఒక్క కొడుకు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు

చెన్నూరు(వల్లూరు) : చెన్నూరులోని కొత్త రోడ్డులో గల మెడికల్ షాపు, కూల్ డ్రింక్ షాపుల్లో 5 రోజుల క్రితం జరిగిన చోరీ కేసుకు సంబంధించి ఇద్దరు నిందితులను శనివారం అరెస్టు చేసినట్లు సీఐ పురుషోత్తం రాజు తెలిపారు. సుమారు రూ.60 వేలకు పైగా విలువ చేసే వస్తువులు చోరీకి గురైనట్లు షాపుల యజమానులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని తెలిపారు. ఈ మేరకు కడప పట్టణానికి చెందిన సయ్యద్ మహమ్మద్ యూసుఫ్, షేక్ ఫర్హాన్‌లను శాటిలైట్ సిటీ సమీపంలో అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.2500 నగదును, రెండు సెల్ ఫోన్‌లు, ఒక స్మార్ట్ వాచ్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు వారిని కోర్టుకు హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.

విద్యార్థికి పాము కాటు

మదనపల్లె : తరగతి గదిలో విద్యార్థి పాముకాటుకు గురైన సంఘటన శనివారం ములకలచెరువు మండలంలో జరిగింది. పెద్దపాళ్యం హైస్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్న రియాజ్ (12) తరగతి గదిలో కూర్చుని కిటికీ తలుపులు తెరవగా, అక్కడే ఉన్న పాము చేతిపై కాటువేసింది. దీంతో విద్యార్థి అస్వస్థతకు గురికాగా, పాఠశాల ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు విద్యార్థిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

ఇద్దరు అంతర్ జిల్లా దొంగల అరెస్టు

రాయచోటి టౌన్ : రాయచోటి అర్బన్ పోలీసులు ఇద్దరు అంతర్ జిల్లా దొంగలను అరెస్టు చేసి వారివద్ద నుంచి 86.5 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు శనివారం అర్బన్ పోలీస్ స్టేషన్‌లో రాయచోటి డీఎస్పీ ఎం.టీ. కృష్ణమోహన్ వివరాలు వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. జూన్ 30వ తేదీ రాయచోటి పట్టణంలోని లక్ష్మీపురంలో రెండు ఇళ్లలో దొంగలు బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు. దీనిపై కేసు నమోదు చేసిన అర్బన్ సీఐ చంద్రశేఖర్ తన సిబ్బందితో దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం రాయచోటి-గాలివీడు రింగ్ రోడ్డు వద్ద ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితులు నెల్లూరు జిల్లా కావలి పట్టణం మానస హాల్ సమీపంలోని నండిపల్లె గోపి, అదే జిల్లా గుడిపిల్లపాడు లక్ష్మీగణపతి వీధికి చెందిన లింగుటేరి రాంబాబుగా గుర్తించారు. వీరి నుంచి 14 గ్రాముల బరువు ఉన్న రెండు చైన్లు, 6 గ్రాములు ఉన్న కడియం, 27.750 గ్రాములు బరువు ఉన్న నల్లపూసల దండ, 38,750 గ్రాములు ఉన్న నాలుగు బంగారు గాజులు మొత్తం 86.500 గ్రాముల బరువు ఉన్న బంగారు వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. వీరిద్దరూ గతంలో పలు పోలీస్ స్టేషన్లలో 12 కేసుల్లో నిందితులుగా ఉన్నారని తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ కేసులో నిందితులను అరెస్టు చేసేందుకు కృషి చేసిన అర్బన్ సీఐ చంద్రశేఖర్‌తో పాటు అర్బన్ ఎస్ఐలు నరసింహారెడ్డి, అర్బుల్ జహీర్, సిబ్బంది రామచంద్ర, బర్కతుల్లా, మహేంద్ర నాయుడు, పెంచలయ్య, మహేంద్రలను జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు.

వరుడిని ఆశీర్వదించిన వైఎస్ భారతిరెడ్డి



నూతన వరుడితో వైఎస్ భారతిరెడ్డి, ఆమె తల్లి ఈసీ సుగుణమ్మ

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలో ఆర్అండ్‌బీ డీఈగా పనిచేస్తున్న శ్రీధర్ రెడ్డి, వైఎస్ మెమోరియల్ బాలికల కళాశాల అధ్యాపకురాలిగా పనిచేస్తున్న అనితమ్మల కుమారుడు యశ్వంత్ రెడ్డి వివాహం కాకినాడకు చెందిన శ్రీనిజతో ఆదివారం రాత్రి జరగనుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సతీమణి వైఎస్ భారతిరెడ్డి, ఆమె తల్లి ఈసీ సుగుణమ్మలతో పాటు మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ వైఎస్ ప్రమీలమ్మ, వైఎస్సార్‌సీపీ పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి దుష్యంత్‌రెడ్డి, ఆయన సతీమణి శిల్పతో పాటు వైఎస్ కుటుంబ సభ్యులు వైఎస్ ఆనందరెడ్డి, వైఎస్ ప్రకాష్‌రెడ్డి, వైఎస్ ప్రతాప్‌రెడ్డి, వైఎస్ జోసఫ్‌రెడ్డి తదితరులు శనివారం నూతన వరుడిని ఆశీర్వదించారు.

కాపర్, సిల్వర్ వైర్ల దొంగలు అరెస్టు

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలో కాపర్ వైర్లు, సిల్వర్ వైర్లు అపహరించే నలుగురు దొంగలను అరెస్టు చేసినట్లు రిమ్స్ ఎస్ఐ జయరాములు తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు కర్నూలు జిల్లాకు చెందిన వెంకటేష్, కడప నిరంజన్ నగర్‌కు చెందిన ప్రవీణ్ కుమార్, శ్రీనివాస్, ఖాజా హుస్సేన్‌లు కాపర్, సిల్వర్ వైర్లను దొంగిలించి వాటిని ముద్దలుగా తయారుచేసి విక్రయించి వచ్చిన డబ్బుతో జల్సాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. నలుగురిని రిమ్స్ రోడ్డు రైల్వే ట్రాక్ బ్రిడ్జి వద్ద అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 150 కేజీల కాపర్ వైర్, 50 కేజీల సిల్వర్ వైర్లు స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండుకు తరలించినట్లు తెలిపారు

చిరు వ్యాపారులపై కూటమి నేతల ప్రతాపం

లబోదిబోమంటున్న నిరుపేదలు



రోటరీపురంలో మసీదు వద్ద చిరు వ్యాపారులు ఏర్పాటు చేసుకున్న అంగళ్లు

పులివెందుల టౌన్ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పులివెందులలో టీడీపీ నాయకులు, కార్యకర్తల అకృత్యాలు పెరిగిపోయాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పులివెందుల పట్టణంలోని రోటరీపురం వంక సమీపంలో ఉన్న మసీదు వద్ద పేద చిరు వ్యాపారులు అంగళ్లు ఏర్పాటు చేసుకుని గత 25 ఏళ్లుగా జీవనం సాగిస్తున్నారు. ఇంతవరకు ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ఏ నాయకుడు తమ అంగళ్లకు అభ్యంతరాలు తెలపలేదని చిరు వ్యాపారులు పేర్కొంటున్నారు. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొంతమంది టీడీపీ నాయకులు ఇక్కడ అంగళ్లు ఉండకూడదని అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్‌కు కూడా టీడీపీ నాయకులు ఫిర్యాదు చేసి ఒత్తిడి తెస్తున్నట్లు చిరు వ్యాపారులు వాపోతున్నారు. ఈ అంగళ్లు ఉండటం వల్ల స్థానిక ప్రజలకు, మసీదు కమిటీ సభ్యులకు ఎలాంటి అభ్యంతరం లేకపోయినా టీడీపీ శ్రేణులు లేనిపోని రాద్ధాంతం చేస్తున్నారని పలువురు వాపోతున్నారు. గతంలో పులివెందుల పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయ సమీపంలో ఉన్న చిరు వ్యాపారిని కూడా ఇదే విధంగా టీడీపీ నాయకులు ఇబ్బంది పెట్టారు. నాయకుల జోక్యంతో టీడీపీ శ్రేణులు వెనక్కి తగ్గడంతో ప్రస్తుతం యథావిధిగా వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. 25 ఏళ్లుగా రోటరీపురంలో చిరు వ్యాపారులు వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈ అంగళ్లను తొలగిస్తే రోడ్డున పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వారు ఆవేదన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక బీసీలు, మైనార్టీలే టార్గెట్‌గా వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ప్రభుత్వాలు చిరు వ్యాపారులను ఆదుకోవాలే కానీ ఇబ్బంది పెట్టడం సరికాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. అధికారులు, నాయకులు స్పందించి తమ పొట్ట కొట్టకుండా చూడాలని చిరు వ్యాపారులు కోరుతున్నారు.

జిల్లా యోగా జట్లు ఎంపిక

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియంలో శనివారం నిర్వహించిన ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి యోగా జట్ల ఎంపికలకు చక్కటి స్పందన లభించింది. శనివారం నిర్వహించిన అండర్-14, అండర్-17 బాలబాలికల ఎంపికలను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి.అరుణకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించి జిల్లాకు పతకాలు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో యోగా నిపుణులు డాక్టర్ ఆర్. రంగనాథరెడ్డి, పెంచలయ్య, ఫిజికల్ డైరెక్టర్లు బాబు, సుశీలమ్మ, ఇబ్రాయిల్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా అండర్-14 బాలబాలికల యోగా జట్టు

జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

అండర్-14 బాలికలు : కె. మనస్విని, వై.నాగసిరి, కె.నందిని, టి.తేజశ్రీ, డి.శస్మి, ఎం.నాగవైష్ణవి, ఎల్.సుమతి, యు.హెచ్.రాణి, డి.దీపిక, వి.రిషిత.

అండర్-14 బాలురు : వై.క్రాంతిరెడ్డి, ఎస్.ప్రణీత్, బి. బన్నీ, పి.మహీధర్, కె.చంద్ర ఓబుళరెడ్డి, కె.ఆకాష్, వై.భరత్, ఎ. అశోక్, ఎం. లోహిత్ రంజన్, ఆర్. నాగసిద్ధార్థ.

అండర్-17 బాలికలు : ఎస్. సన్నీ, ఎస్.సోనీ, సి.ప్రవల్లిక, వైష్ణవి, బి.అనూరాధ, ఎస్.కె.రసూల్‌బీ, ఎస్.పావని, కె.అనిత, సి.కావ్య, వై.భవ్య.

అండర్-17 బాలురు : ఎస్.సాయిధనుంజయరెడ్డి, శ్రీమన్నారాయణ, పి.రత్నాకర్, ఎం.వినోద్‌కుమార్, కె.జయప్రకాష్, ఎం.జగదీష్, బి. శ్రీకర్‌తేజ, అభిషేక్, సుశాంత్, సాత్విక్.

వర్షం కారణంగా మ్యాచ్‌లకు ఆటంకం

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్ జిల్లాల అండర్-14 క్రికెట్ టోర్నమెంట్‌కు వర్షం ఆటంకంగా మారింది. కేఎస్ఆర్ఎం మైదానంలో శనివారం నిర్వహించాల్సిన చిత్తూరు, విశాఖపట్నం మ్యాచ్ వర్షం కారణంగా తొలిరోజు రద్దయింది. వైఎస్ఆర్ఆర్-ఏసీఏ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో కర్నూలు, పశ్చిమగోదావరి జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన పశ్చిమగోదావరి జట్టు 76.1 ఓవర్లలో 98 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని కె.పి.నారాయణ 29, శ్రీసూర్యసాయి మణికంఠ 17 పరుగులు చేశారు. కర్నూలు బౌలర్లు గిరిధారి 3, హరిహరణ్ 3 వికెట్లు తీశారు. దీంతో తొలిరోజు మ్యాచ్ ముగిసింది.



తలపడుతున్న కర్నూలు, పశ్చిమగోదావరి జట్లు

కేఓఆర్ఎం మైదానంలో..

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో తూర్పుగోదావరి, ప్రకాశం జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన తూర్పుగోదావరి జట్టు బ్యాటింగ్‌కు దిగి 41.2 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 112 పరుగులు చేసింది. జట్టులోని రేవంత్ 32 పరుగులు, రాజ్‌ఆర్యన్ 22 పరుగులు చేశారు. ప్రకాశం బౌలర్లు లోకేష్ 2, ఉదయ్‌నాయుడు 2 వికెట్లు తీశారు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.

గండిలో కొబ్బరి కాయల విక్రయ హక్కు రూ. 80 లక్షలు

చక్రాయపేట : గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో ఏడాది కాలం పాటు కొబ్బరి కాయల విక్రయ హక్కు ఈసారి రికార్డు ధర పలికింది. సీల్డు టెండరు, బహిరంగ వేలంలో వేంపల్లెకు చెందిన వెంకట రమణారెడ్డి రూ.80లక్షలకు పోటీలో హక్కును దక్కించుకున్నారు. గత ఏడాది రూ.52.03 లక్షలు పలికిన టెంకాయల వేలం పాట ఈసారి రూ. 80 లక్షలకు చేరింది. గత ఏడాది కంటే రూ.27 లక్షలు అధికంగా వచ్చింది. గతంలో జీఎస్టీ ఉండేది కాదు. ఈసారి రూ.80 లక్షలకు జీఎస్టీ రూ.14.4 లక్షలు చెల్లించాల్సిందేనని ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య సూచన మేరకు వెంకట రమణారెడ్డి ఆ మొత్తం కూడా చెల్లించారు. కార్యక్రమంలో చైర్మన్ కావలి కృష్ణతేజ, కడప దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శివయ్య, ఆర్కే వ్యాలీ సీఐ నాగరాజు, ఆలయ ప్రధాన, ఉప ప్రధాన అర్చకులు కేసరి, రాజారమేష్, చక్రాయపేట ఎస్ఐ కృష్ణయ్య, సూపరింటెండెంట్ షరీఫ్, ఇన్‌స్పెక్టర్ రవిచంద్రారెడ్డి, మురళి, జయచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గండిలో టెండర్లు నిర్వహిస్తున్న అధికారులు

మద్యం షాపులా.. మజాకా!

- ముద్దనూరులో మద్యం దుకాణాల ప్రారంభంలో వివాదం
- మూడు రోజులుగా తిష్ట వేసిన డీఎస్పీ
- ఎన్నికల బందోబస్తును తలపిస్తున్న వైనం



సిబ్బందికి సూచనలిస్తున్న ఇన్‌చార్జి డీఎస్పీ

ముద్దనూరు : కేవలం రెండు మద్యం దుకాణాలను ప్రారంభించేందుకు ముద్దనూరు మండల కేంద్రంలో ఒక డీఎస్పీ, నలుగురు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఐదుగురు ఎస్ఐలు, 40 మంది పోలీసు కానిస్టేబుళ్లు బందోబస్తు విధుల్లో నిమగ్నమయ్యారు. గత 3 రోజులుగా పోలీసుల కవాతు, బందోబస్తును చూస్తుంటే ఎన్నికల నిర్వహణను తలపిస్తోంది. అధికార కూటమి వర్గీయుల మధ్య మద్యం దుకాణాల ఏర్పాటులో తలెత్తిన ఘర్షణను అదుపు చేసేందుకు ఇంత భారీ సంఖ్యలో పోలీసులు మోహరించడంపై స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఫ్యాక్షన్ నేపథ్యమున్న ముద్దనూరు మండలంలో హత్యలు, గొడవలు లేకుండా ఎన్నికలు నిర్వహించేందుకు మాత్రమే ఇలాంటి బందోబస్తు ఏర్పాటు చేసిన సందర్భాలున్నాయి. ప్రస్తుతం జరిగిన మద్యం దుకాణాల కేటాయింపులో ముద్దనూరుకు రెండు దుకాణాలు వచ్చాయి. వీటిలో ఒకటి భూపేష్ రెడ్డి వర్గీయులకు చెందినది కాగా, మరొకటి సీఎం సురేష్‌నాయుడు వర్గీయుడికి దక్కింది. అయితే శుక్రవారం రాత్రి భూపేష్ వర్గీయుడి మద్యం దుకాణం ప్రారంభం సందర్భంగా ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి వర్గీయులు ఆందోళనకు దిగడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. చివరకు పోలీసులు పరిస్థితిని చక్కదిద్ది దుకాణం సజావుగా సాగేలా చూశారు. కాగా, పోట్లదుర్తి సురేష్ నాయుడు వర్గీయుడు మద్యం దుకాణం ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నాడు. అయితే అతనికి గది దొరకకుండా చేస్తున్నారు. సురేష్ నాయుడు శనివారం రాత్రి ముద్దనూరు పోలీస్ స్టేషన్‌లో మద్యం దుకాణం ప్రారంభం గురించి చర్చించారు. ఈ నేపథ్యంలో పోలీసులు ముందు జాగ్రత్తగా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. మూడు రోజులుగా ముద్దనూరులో ఏకంగా డీఎస్పీ మురళీ నాయక్ తిష్ట వేశారు.